క్లుప్తంగా

ముదునూరికి బొమ్మిడి శుభాకాంక్షలు



ముదునూరి ప్రసాదరాజుకు అభినందనలు తెలుపుతున్న జనసేన అభ్యర్థి నాయకర్

నరసాపురం రూరల్: ఎన్నికల బరిలో ప్రత్యర్థులుగా ఉన్న ముదునూరి ప్రసాదరాజు, బొమ్మిడి నాయకర్‌లు కరచాలనం చేసుకుంటున్న ఫొటో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళితే నరసాపురం అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు శుక్రవారం నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వెళుతున్న సందర్భంలో సీతారాంపురం వద్ద ఎదురుపడిన జనసేన పార్టీ అభ్యర్థి బొమ్మిడి నాయకర్‌కు ప్రసాదరాజు అభివాదం చేశారు. దీంతో ప్రసాదరాజు ప్రయాణిస్తున్న వాహనం వద్దకు వచ్చిన నాయకర్ ఆయనకు కరచాలనం చేసి అభినందనలు తెలిపారు.

మే 11న జాతీయ లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: వాదించుకుంటే ఎవరో ఒక్కరే గెలుస్తారని అదే సమస్యను పరిష్కరించుకుంటే ఇద్దరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ శుక్రవారం తెలిపారు. మే 11వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో ఉదయం 10 గంటల నుండి జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. చిన్న చిన్న వివాదాలు పెద్దవి కాకుండా రాజీయోగ్యమైన కేసులను పరిష్కరించుకుంటే పట్టుదలలు పెరగవన్నారు. అంతే కాకుండా కోర్టుల చుట్టూ తిరిగే సమస్య, సమయం, నగదు వృథాకాకుండా ఉంటాయని తద్వారా స్నేహపూర్వకమైన మానవ సంబంధాలు పెరుగుతాయని అన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



సుఖీభవ ఆసుపత్రి వద్ద మాక్ డ్రిల్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకొల్లు సెంట్రల్: అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు వేగంగా నిర్ణయాలు తీసుకోవాల్సిన సమయంలోనూ సమయస్ఫూర్తితో స్పందించడంతో ప్రమాదాల నుండి బయటపడవచ్చని సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వైవీజాన కిరామ్ అన్నారు. శుక్రవారం అగ్నిమాపక వారోత్సవాలు ఆరవ రోజు సందర్భంగా ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్ చేసి డాక్టర్లు, ఆసుపత్రి సిబ్బంది, రోగులకు అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ప్రాణ నష్టం జరగకుండా ఎలా మంటలను అదుపులోకి తీసుకురావాలి? ఎలా బయటపడాలి? వంటి అంశాలను ఫైర్ సిబ్బంది మాక్ డ్రిల్ ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యేంద్ర కుమార్, డాక్టర్ సీహెచ్ సురేష్‌బాబు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ బళ్ల సురేష్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేపీ పాలెం సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ సరఫరా లైన్లు వెంబడి ట్రీ కటింగ్, అభివృద్ధి పనుల నిమిత్తం మండలంలోని పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్, కేపీ పాలెం నార్త్, కేపీ పాలెం సౌత్ గ్రామాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని వివరించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆచంటలో నాలుగు నామినేషన్ల దాఖలు

పెనుగొండ: ఆచంట నియోజకవర్గంలో రెండో రోజు శుక్రవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.స్వామి నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. చెరుకువాడ శ్రీరంగనాథరాజు రెండు సెట్లు, పితాని సత్యనారాయణ మూడు సెట్లు, చెరుకువాడ వెంకట నరసింహరాజు రెండు సెట్లు, పితాని వెంకట సురేష్ ఒక సెట్టు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

ఘనంగా శీతలింగేశ్వర స్వామి కల్యాణం

పెనుగొండ: సిద్ధాంతంలోని శ్రీ పార్వతీ సమేత శీతలింగేశ్వర స్వామి వారి కల్యాణం శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వేదమూర్తులు ములపర్రు వాస్తవ్యులు దుంతుకుర్తి సత్యనారాయణ శర్మ బ్రహ్మత్వంలో అక్షింతల సత్య సురేష్, నాగ సూర్య లక్ష్మీ కుమారి దంపతులతో కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించి సాయంత్రం స్వామి వార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



నరసాపురం: నామినేషన్ వేయడానికి సబ్ కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటున్న ముదునూరి ప్రసాదరాజు



పెనుగొండ: నామినేషన్ వేయడానికి పాదయాత్రగా వెళ్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

- చీఫ్ విప్ ముదునూరి, మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు
- నరసాపురం, పాలకొల్లు నియోజకవర్గాల్లో నామినేషన్ల సందడి

నరసాపురం: వైఎస్సార్ సీపీ గెలుపును ప్రజలు మనసారా కోరుకుంటున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం ముదునూరి నరసాపురం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. ముదునూరి 3 సెట్లు, డమ్మీగా ఆయన సతీమణి శారదావాణి మరో 3 సెట్లు నామినేషన్ పత్రాలను నరసాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, నరసాపురం ఆర్డీవో ఎం.అచ్యుత్‌అంబరీష్‌కు అందించారు. నామినేషన్ అనంతరం బయట విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లపాటు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించారని చెప్పారు. దళారీ వ్యవస్థ లేకుండా సంక్షేమ పథకాల ఫలాలు నేరుగా ప్రజలకు అందేలా చేశారన్నారు. నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సంక్షేమం తాలూకూ సొమ్మును జమ చేసి ప్రజలు ఎవరి వద్దకూ తిరిగే ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేదన్నారు. ముఖ్యంగా నరసాపురం నియోజకవర్గ అభివృద్ధికి తాను ఐదేళ్ల పాటు నిరంతరం కృషి చేశానన్నారు. వశిష్ఠ వంతెన, బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ వంటి దీర్ఘకాల సమస్యలను ఓ కొలిక్కి తెచ్చుకోగలిగామని చెప్పారు. దేశంలోనే మూడో ఆక్వా యూనివర్సిటీ నరసాపురంలో నెలకొల్పుకున్నామని చెప్పారు. 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్ అభివృద్ధి చేసుకున్నామని చెప్పారు. నియోజకవర్గ ప్రజలు తనకు అండగా నిలుస్తారని, తన గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు మొగల్తూరు మండలం పాతపాడు నుంచి ముదునూరి పార్టీ అభిమానులు, కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాతపాడు నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ ఘనంగా ర్యాలీ సాగింది. ఆయన వెంట పాలకొల్లు వైఎస్సార్ సీపీ అభ్యర్థి గుడాల గోపి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు చాగంటి సత్యనారాయణ, వైకేఎస్, షేక్ బులిమస్తాముస్, జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, జిల్లా మత్స్యకార సొసైటీల సంఘం అధ్యక్షుడు అంగ్రాజు చల్లారావు, కామన బుజ్జి, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, నల్లిమిల్లి జోసఫ్, గుడివాడ ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

ఆచంటలో ప్రభంజనం

పెనుగొండ: జనం.. జనం.. ప్రభంజనం ఇది ఆచంట నియోజకవర్గంలోని పరిస్థితి. శుక్రవారం ఆచంట నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు నామినేషన్ దాఖలు చేశారు. నియోజకవర్గంలో నలుమూలల నుంచి వచ్చిన అభిమానులు, కార్యకర్తలు, నాయకులతో ఇసుకు వేస్తే రాలనంతగా ఆచంట రహదారులు కిక్కిరిసిపోయాయి. ఉదయం 9 గంటలకు శ్రీరంగనాథరాజు తూర్పుపాలెంలో కార్యాలయంలో మహిళలు విజయ తిలకం దిద్దగా భారీ అనుచర గణంతో తూర్పుపాలెంలో నుంచి ఆచంట ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకూ భారీ పాదయాత్ర నిర్వహించారు.

రూట్‌మ్యాప్‌లో గందరగోళం

శుక్రవారం రెండో రోజు వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థులు ఇద్దరూ ఒకేసారి నామినేషన్ దాఖలు చేయడానికి ముహూర్తం నిర్ణయించుకోవడంతో అధికారులు రూట్ మ్యాప్ ఇవ్వకపోవడంతో తీవ్ర గందరగోళం ఏర్పడింది. టీడీపీ నాయకులు మార్టేరు సెంటర్‌లో ముందుగా మోటార్ సైకిళ్లపై వచ్చి రహదారిని బ్లాక్ చేయడానికి ప్రయత్నించారు. దీంతో పెనుమంట్ర నుంచి భారీ స్థాయిలో వచ్చిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు అక్కడ ఉండడంతో కొద్ది సేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వైఎస్సార్ సీపీ భారీ ర్యాలీ ఉండడంతో చివరకు టీడీపీ కార్యకర్తలు వెనుకడుగు వేశారు. ఇదే పరిస్థితి మరోసారి తూర్పుపాలెం వద్ద ఏర్పడడంతో మహిళల ఆశీర్వదంతో బయలుదేరిన శ్రీరంగనాథరాజును మోటారు సైకిళ్లతో అడ్డుకోవడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. భారీ ర్యాలీగా వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను, మహిళలను కించపరిచే విధంగా కొందరు టీడీపీ కార్యకర్తలు వ్యవహరించడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. శ్రీరంగనాథరాజు పిలుపుతో కార్యకర్తలు, మహిళలు సంయమనం పాటిస్తూ ముందుకు సాగారు. ముహూర్తానికి ఆలస్యం చేయడానికి టీడీపీ నాయకులు ప్రయత్నించినా వైఎస్సార్ సీపీ ఆచంట నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముహూర్తానికే నామినేషన్ దాఖలు చేసారు. డీసీసీబీ డైరెక్టరు కూనపరెడ్డి లక్ష్మయ్య నాయుడు (నానాజీ), నగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ, మట్టా ఆనంద్‌కుమార్, పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద)లు బలపరచగా ఉంగుటూరు శాసన సభ్యుడు, ఉంగుటూరు అసెంబ్లీ అభ్యర్థి పుప్పాల వాసుబాబు, ఏపీ హౌసింగ్ బోర్డు చైర్మన్ మేడపాటి షర్మిలా రెడ్డిలు హాజరుకాగా, రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. శ్రీరంగనాథరాజుతో పాటు వారి తనయుడు చెరకువాడ నరేష్‌రాజు రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు.

13 మంది వలంటీర్ల రాజీనామా



వేములదీవి ఈస్ట్ సచివాలయ కార్యదర్శికి రాజీనామాలు అందిస్తున్న వలంటీర్లు

నరసాపురం రూరల్: మండలంలోని వేములదీవి ఈస్ట్ గ్రామ సచివాలయం పరిధిలోని 13 మంది వలంటీర్లు శుక్రవారం స్వచ్ఛందంగా తమ విధులకు రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా ప్రతులను సచివాలయ కార్యదర్శి హరితకు అందజేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారం నేపథ్యంలో వలంటీర్లు రాజీనామా చేశారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యాలి



పడమటిపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న ప్రసాదరాజు తనయుడు శ్రీ కృష్ణంరాజు

మొగల్తూరు: నియోజకవర్గంలో, మీ గ్రామంలోనూ జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి వైఎస్సార్ సీపీ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజుకు ఓటేసి గెలిపించాలని ఆయన కుమారుడు శ్రీకృష్ణంరాజు ఓటర్లను కోరారు. శుక్రవారం తండ్రి ప్రసాదరాజు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సాయంత్రం మొగల్తూరు పంచాయతీ పడమటిపాలెంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, కుక్కల కృష్ణ మోహన్, వైస్ ఎంపీపీ కైలా సుబ్బారావు, చినిమిల్లి చందు, కుక్కల సోమేశ్వరరావు, రేవు రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమం.. అభివృద్ధే శ్రీరామరక్ష



పెనుగొండ మండలం నుంచి బైక్ ర్యాలీగా వస్తున్న శ్రీరంగనాథరాజు తనయుడు నరేష్‌రాజు



ఆలమూరు నుంచి మోటారు సైకిళ్లపై ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఆచంట ర్యాలీలో ఓ ప్రాంతం వద్ద కిక్కిరిసిన కార్యకర్తలు, నాయకులు

పెనుగొండ: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయని ఆచంట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. శుక్రవారం ఆచంట ఎన్నికల అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నామినేషన్ దాఖలుచేయడానికి పాదయాత్రలో అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పోటే త్తారన్నారు. వైఎస్సార్ సీపీపై అభిమానంతో 50 వేలకు పైగా చరిత్రలో సువర్ణ ధ్యాయం లిఖించే విధంగా తరలి వచ్చారన్నారు. ఇదీ ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో జరిగిందన్నారు. 2019 ను మించి తరలి వచ్చారన్నారు. దీంతో వైఎస్సార్ సీపీ విజయం నేడే ఖరారైపోయిందన్నారు. టీడీపీ అభ్యర్థి పితాని సత్యనారాయణ 15 ఏళ్ల పాటు కులాల కుంపటిని రాజేసే వారన్నారు. నేడు ఎక్కడా కుమ్ములాటలు లేవన్నారు. సిద్ధాంతం, వడలి, పెనుగొండ వంటి ప్రాంతాల్లో నిత్యం కులాల కుమ్ములాటలకు ఆద్యం పోసేవారన్నారు. నేడు ప్రశాంతంగా ఉన్నామంటూ ప్రజలు ఊపిరి పీల్చుకొంటున్నారన్నారు. ప్రజలంతా వైఎస్సార్ సీపీనే కోరుకొంటున్నారన్నారు. పారదర్శక పాలన వలనే ప్రజలు నమ్మకం ఉంచారన్నారు. ఎన్నో కుయుక్తులు పన్నుతున్నారని, వారి ప్రయత్నాలు విఫలమవ్వడం ఖాయమన్నారు. సమావేశంలో ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి, ఎంపీపీలు కర్రి వాసు రెడ్డి, పూతినీడి పెద్ద తదితరులు పాల్గొన్నారు.

భారీగా తరలివెళ్లిన నాయకులు

పెనుమంట్ర: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆచంట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆచంటలో నామినేషన్ పత్రాలు దాఖలు చేయనున్న సందర్భంలో శుక్రవారం పెనుమంట్ర మండలంలో అన్ని గ్రామాలనుంచి పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున స్వచ్ఛందంగా తరలివెళ్లారు. ఎస్ ఇల్లిందలపర్రు గ్రామం నుంచి ఆటోలు, మోటారు సైకిళ్లపై ర్యాలీగా బయలుదేరిన కార్యకర్తలు జుత్తిగ, నత్తారామేశ్వరం, బ్రాహ్మణచెర్వు సెంటర్, ఆలమూరు మీదుగా మార్టేరుకు చేరుకున్న అనంతరం ఆచంటకు ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అయితే మార్టేరు సెంటర్‌లో కొందరు టీడీపీ, జనసేన నాయకులు ట్రాఫిక్ అంతరాయం సృష్టించడంతో గంటన్నరకు పైగా మార్టేరు ట్రాఫిక్‌లో పెనుమంట్ర మండలానికి చెందిన అనేక మంది నాయకులు, కార్యకర్తలు చిక్కుకుపోయారు. ఎంపీపీ కర్రి వెంకటనారాయణరెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు గూడూరి దేవేంద్రుడు, మండల పరిషత్ 1,2 ఉపాధ్యక్షులు ఈదిఅనితా ప్రవీణ్, వాసంశెట్టి కిరణ్, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు పలువురు ప్రముఖ నాయకులు ట్రాఫిక్‌లో చిక్కుకుపోవడంతో నామినేషన్ స్థలానికి సకాలంలో చేరుకోలేకపోయారు. అయినప్పటికీ నియోజవర్గం నలుమూలల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి శ్రీరంగనాథరాజుకు సంఘీభావంగా నామినేషన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మేడపాడులో లక్ష తులసి పూజ



మేడపాడులో లక్ష తులసి పూజ నిర్వహిస్తున్న దంపతులు

యలమంచిలి: శ్రీరామనవమిని పురస్కరించుకుని మేడపాడు గ్రామంలోని ముద్దల వారి వీధిలో మేడిచర్ల వారి ఇంటి వద్ద ఉన్న రామాలయంలో శ్రీసీతారామ పట్టాభిషేక ఉత్సవాలలో భాగంగా మూడవ రోజు శుక్రవారం లక్ష తులసి పూజ, పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. సుమారు 35 మంది దంపతులు పూజలో పాల్గొన్నారు. అంబేడ్కర్ కొనసీమ జిల్లా గుడిమెళ్లంక గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ కడియాల సుబ్రహ్మణ్యశర్మ, ప్రతిష్టాచార్య మానేపల్లి సత్యనారాయణశర్మ బ్రహ్మత్వంలో సుమారు 10 మంది వేద పండితులు శాస్త్రోక్తంగా లక్ష తులసి పూజ చేయించారు. సాయంత్రం శ్రీసీతారామలక్ష్మణ సహిత ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించిన పల్లకిలో ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

నిండుకుండలా మంచినీటి చెరువులు



దుంపగడపలో నిండుకుండను తలపిస్తున్న మంచినీటి చెరువు

ఆకివీడు: వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. ముందస్తుగా మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపారు. అలాగే వంతులవారీగా సాగునీరు అందిస్తుండడంతో వ్యవసాయ సాగు గట్టెక్కింది. చాలా గ్రామాల్లో వరి కోతకు సిద్ధంగా ఉంది. మరొక వంతు నీరు అందితే జిల్లాలో సాగుకు నీరు సరిపోతుందని రైతులు చెబుతున్నారు. అలాగే కాలువలు మూసివేసే సమయానికి మరోమారు మంచినీటి చెరువులకు నీరు నింపుకునే అవకాశం ఉంటుంది. దీంతో మళ్లీ కాలువల వదిలే సమయం వరకూ నీటిఎద్దడి ఉండదని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. పలు గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకం ద్వారా శివారు ప్రాంతాలకు మంచినీటి సౌకర్యం కల్పించే విధంగా ప్రభుత్వం ఇటీవల పైప్‌లైన్ల విస్తరణ, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం పూర్తి చేశారు. దీంతో శివారు ప్రాంతాలకు కూడా తాగు నీరందుతోంది. గతంలో ఆయా ప్రాంతాలకు మంచినీటి సరఫరాకు అవకాశం లేక ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రజలకు అందజేసేవారు. ఆ దుస్థితి నుంచి ప్రజలు బయటపడ్డారు.

అడుగడుగునా నీరాజనం



పాతపాడు నుంచి నామినేషన్ వేయడానికి ర్యాలీగా బయలుదేరిన ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



ముదునూరి నామినేషన్ సందర్భంగా భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం/మొగల్తూరు: నరసాపురం అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ముదునూరి ప్రసదరాజు శుక్రవారం నిమినేషన్ దాఖలు చేశారు. భారీ బైక్‌ర్యాలీతో నామినేషన్ కార్యక్రమం పండుగగా సాగింది. నియోజకవర్గం నలు మూలలు నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రతినిధులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలు, ముదునూరి అభిమానులు పెద్ద ఎత్తుల నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో ర్యాలీ పొడవునా, పట్టణమంతా జై ముదునూరి నినాదాలు మిన్నంటాయి.ముదునూరి సతీమణి శారదావాణి, కుమారుడు శ్రీకృష్ణంరాజుతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. ఉదయం 8 గంటలకు మొగల్తూరు మండలం పాతపాడు నుంచి ముదునూరి ర్యాలీగా బయలు దేరారు. ప్రచార రథంపై ఆయన ఉండగా ముందు వరుసలో సుమారు 2వేలు బైక్‌లతో ర్యాలీ సాగింది. దారిలో ముత్యాలపల్లి బండి ముత్యాలమ ఆలయం వద్ద ముదునూరి పూజలు చేశారు. అక్కడినుంచి మొగల్తూరు, సీతారామపురం మీదుగా ర్యాలీ సాగింది. మహిళలు పెద్దసంఖ్యలో హాజరవ్వడం విశేషం. దారి పొడవునా మహిళలు ముదునూరికి హారతులు ఇచ్చారు. జై ముదునూరి నినాదాలు హోరెత్తాయి. ఉదయం 11.20 గంటలకు సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీ వెంకటరమణ, పార్టీ కౌన్సెలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నేతలు పాల్గొన్నారు.

వైభవంగా క్షీరారామలింగేశ్వరుని కల్యాణం



క్షీరారామలింగేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీ పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీ సమేత శ్రీ జనార్ధనస్వామి వార్ల సప్తాహ్నిక కల్యాణం రంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం తెల్లవారుజామున (గురువారం రాత్రి) జరిగిన కల్యాణోత్సవ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ దంపతులు పాల్గొన్నారు. భమిడపాటి వెంకన్న, సూరిబాబుల బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు కిష్టప్ప, వీరబాబు, పూర్ణయ్యలు కల్యాణ తంతును నిర్వహించారు. స్థానిక యడ్లబజారు సెంటర్‌లో కొలువై ఉన్న శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం నుంచి అర్చకులు రమణ గురుస్వామి కల్యాణమూర్తులకు పట్టు వస్త్రాలు, పసుపు, కుంకుమ, రవికలు సమర్పించారు. దాతలు కంచర్ల రామారావు, నాని, గౌరి కుటుంబ సభ్యులు భక్తులకు లడ్డు ప్రసాదం, గాదె సుబ్బారావు దంపతులు గిఫ్ట్ ఆర్టికల్స్‌ను పంపిణీ చేశారు. మొట్టమొదటిసారి స్వామివార్లకు వడ్లను చేతితో వలిచి తలంబ్రాలు తయారు చేశారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి వచ్చి స్వామివారి కల్యాణం తిలకించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఎల్‌ఈడీ స్క్రీన్‌లను ఏర్పాటు చేయడంతో తొక్కిసలాట లేకుండా భక్తులు మండపాల్లో కూర్చుని స్వామివార్ల కల్యాణాన్ని తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.